హైదరాబాద్ వార్త










# హోరెత్తిన ఉప్పల్ క్రికెట్ స్టేడియం

ఉప్పల్ క్రికెట్ స్టేడియం హోరెత్తింది. మంగళవారం రాత్రి సన్ రైజర్స్ హైదరాబాద్, ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య జరిగిన ఐపీఎల్ ట్వంటీ 20 మ్యాచ్‌ను చూసేందుకు అభిమానులు పోటెత్తారు. ఈ సీజన్‌లో ఇక్కడిది మూడో మ్యాచ్ అయినప్పటికీ వీక్షకుల్లో ఉత్సాహం తగ్గలేదు. సన్ రైజర్ల జెండాలతో స్టేడియం ఉగ్రూతలూగింది. క్రీడాకారులకు మద్దతుగా ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ అభిమానాన్ని చాటారు. ముంబయి కెప్టెన్ రోహిత్‌శర్మ, తెలుగు కుర్రాడు తిలక్ వర్మతో పాటు కవల సోదరులు డ్యూన్ జాన్‌సెన్, మార్కో జాన్‌సెన్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉప్పల్ రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. మెట్రో స్టేషన్ క్రీడాభిమానులతో నిండిపోయింది. అర్ధరాత్రి 12.30 గంటల వరకు మెట్రోరైళ్లు నడిచాయి. ఎయిర్ పోర్టులో ముంబయి ఇండియన్స్ కెప్టెన్ రోహిత్‌శర్మ తెలుగులో మాట్లాడారు. "మేం వచ్చేసినాము.. ఎంఐ (ముంబయి ఇండియన్స్) ఫ్యాన్స్ పదండి ఉప్పల్‌కు" అంటూ రోహిత్ శర్మ తెలుగులో తన సందేశం వినిపించారు. దీనికి సంబంధించిన వీడియోను ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజ్ సోషల్ మీడియాలతో విడుదల చేసింది. కాగా, రోహిత్‌శర్మ తల్లి పూర్ణిమ శర్మ ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే. ఆమె స్వస్థలం విశాఖపట్నం. మహారాష్ట్రకు చెందిన గురునాథ్‌శర్మను వివాహం చేసుకున్న తర్వాత ముంబయిలో స్థిరపడ్డారు. (హైదరాబాద్ – ప్రభాతవార్త )



భానుడి ఉగ్రరూపం

# మండుతున్న ఎండలు



హైదరాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : భానుడు ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగిపోతున్నాయి. సెగలు కక్కుతున్న సూర్యుడి ప్రతాపానికి బయటకు రావాలంటే నగర జనం జంకుతున్నారు. వేడికి గాలిలో తేమ అసాధారణ స్థాయిలో తగ్గి పొడి వాతావరణం ఏర్పడి ఉక్కపోత అధికమవుతోంది. వారం రోజుల తర్వాత ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, వడగాల్పుల తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. నగర వ్యాప్తంగా ఉదయం పది గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. పగటి వేళల్లో భానుడి తాకిడికి జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రావడంలేదు. దీంతో పగటి వేళల్లో రహదారులన్ని నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. నగరంలో 37డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈసారి వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ విభాగం చెబుతోంది. ప్రస్తుతం ఏప్రిల్ నెలలో వేసవి ఉష్ణోగ్రతలు 37 డిగ్రీలు దాటుతుండడాన్ని వాతావరణశాఖ గుర్తించింది. మే నెల నాటికి ఎండలు మండిపోతాయని అంచనా వేస్తోంది. ఎండ తీవ్రత అధికంగా ఉండే సమయంలో వృద్ధులు, చిన్న పిల్లలు బయట తిరగకూడదని వైద్యులు సూచిస్తున్నారు. పిల్లలకు వడదెబ్బ తగలడంతో పాటు చర్మవ్యాధులు సంబంధించి అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తే గొడుగుతో పాటు గ్లూకోజ్ నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్ల వెంట తీసుకెళ్లాలని సూచిస్తున్నారు.

## గాంధీలో మరోసారి డైట్ టెండర్ల ప్రక్రియకు బ్రేక్

సికింద్రాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి డైట్ టెండర్ల ప్రక్రియకు కోర్టు బ్రేక్ వేసింది. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఆహారాన్ని అందించడం కోసం టెండర్లను ఆహ్వానించారు. మొత్తం 11 దరఖాస్తుల విక్రయం జరుగగా టెండర్ల ప్రక్రియకు చివరి రోజైన సోమవారం కేవలం 5 టెండర్లను మాత్రమే దాఖలు చేశారు. ఈ ప్రక్రియకు కోర్టు బ్రేకు వేసింది. గతంలో రోగులకు పోషక విలువలతో కూడిన, నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం డైట్ చార్జీలకింద రూ. 40నుంచి రూ. 80లకు పెంచింది. ఈమేరకు గతేడాది ఏప్రిల్‌లో నూతన టెండర్లను ఆహ్వానించారు. అయితే అప్పటికే డైట్ కాంట్రాక్టు పొందిన సహస్ర సంస్థ తమ కాలపరిమితి తీరకముందే టెండర్లను పిలువడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించింది. కోర్టు అప్పట్లోనే సహస్ర పిటిషన్‌ను కొట్టివేసింది. అడ్వకేట్ జనరల్ సలహా మేరకు టెండర్లను తెరిచి అర్హత సాధించిన శివనారీ సంస్థకు కాంట్రాక్టును కేటాయించారు. దీంతో తమకు అన్యాయం జరిగిందని సహస్ర సంస్థ మరోమారు పిటిషన్ దాఖలు చేసింది. వాదోపవాదనలు విన్న కోర్టు జిల్లా, రాష్ట్ర డైడ్ కమిటీలో సమస్య పరిష్కరించుకోవాని సూచించింది. రాష్ట్ర డైడ్ కమిటీ ఆదేశాల మేరకు ఈనెల 3న నూతనంగా డైట్ టెండర్లను ఆహ్వానించారు. అయితే గతంలో సహస్ర సంస్థ కోర్టును ఆశ్రయించినట్లుగానే గత ఏప్రిల్‌లో టెండర్ ద్వారా అర్హత పొందిన శివనారీ సంస్థ తాజాగా కోర్టును ఆశ్రయించింది. గతంలో టెండర్‌ను దక్కించుకోగా సహస్ర సంస్థ కోర్టును ఆశ్రయించడంతో తమకు డైట్ నిర్వహణ అప్పగించలేదని, ఇప్పుడు కోర్టు వివాదం ముగినప్పటికి తమకు నిర్వహణ అప్పగించడం లేదని కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని కోర్టుకు తెలిపింది. దీంతో నూతన టెండర్ల ప్రక్రియకు బ్రేకు పడింది.

## కంటోన్మెంట్ అభివృద్ధికి.. పార్టీ
### బలోపేతానికి కృషి చేయాలి : మంత్రి తలసాని

కంటోన్మెంట్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా నియమితులైన మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మంగళవారం మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్యే సాయన్న మృతి చెందడంతో కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలకు పెద్ద దిక్కుకోల్పోయినట్లుగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఆయన చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు యధా విధిగా కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి సూచించారు.

## కంపెనీ కార్మికులకు న్యాయం జరిగే వరకు తోడుంటాం



దీక్షా శిబిరంలో కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

జీడిమెట్ల,ఏప్రిల్18 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పరిధిలోని సూపర్‌మాక్స్ కంపెనీ కార్మికుల 51వ రోజు రిలే నిరాహారదీక్షకు మంగళవారం మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్‌మాక్స్ కంపెనీ కార్మికులకు అండగా ఉంటామని, కార్మికులు ఎలాంటి దిగులు చెందాల్సి అవసరం లేదన్నారు. కంపెనీ యాజమాన్యంతో చర్చించి కార్మికులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని, అప్పటికీ మాజమాన్యం దిగిరాకపోతే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా సహకారమందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి,టీఆర్ఎస్‌కేవీ యూనియన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు మల్లిఖార్జున్, కార్మికులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న నిందితుల అరెస్ట్
### మహీంద్ర ఎక్స్‌యూవీ, ల్యాప్‌ట్యాప్స్, రూ.20లక్షల నగదు స్వాధీనం




స్వాధీనం చేసుకున్న వస్తువులు, నగదుతో పోలీస్ అధికారులు

జీడిమెట్ల, ఏప్రిల్18 ప్రభాతవార్త: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ రాకెట్ గుట్టు రట్టు చేసిన సంఘటన కెపిహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలానగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్వాధీనం చేసుకున్న వస్తువులు, నగదుతో పాటు నిందితుల వివరాలు వెల్లడించారు. కెపిహెచ్‌బీ ఫేజ్7లోని ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్ సి–బ్లాక్, 505 ఫ్లాట్‌లో చట్టవిరుద్ధంగా క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నారనే పక్కా సమాచారంతో మాదాపూర్, కెపిహెచ్ ఎస్ఓటీ అధికారులు సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. ఈ సోదాలో 20లక్షల రూపాయల నగదు, 10కీప్యాడ్ మొబైల్స్, 9స్మార్ట్ ఫోన్స్, రెండు ల్యాప్‌టాప్‌లు, మహీంద్రా ఎక్స్‌యూవీవాహనాలను స్వాధీనం చేసుకొని 4బుకీలను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా గుంటూరుకు చెందిన కొనగటి చైతన్య ప్రమోద్(34), గుంటూరు జిల్లా నర్సారావు పేటకు చెందిన జుజురి మెహర్ చౌదరి(29), బాపట్లకు చెందిన మాడల అవనీంద్ర(29), కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన దేగల రాజేష్(35)గా పోలీసులు గుర్తించారు. క్రికెట్ బెట్టింగ్ రాకెట్ నిర్వహిస్తున్న ప్రధాన నిందితులైన కోనేటి నాగశ్రీను, సాయి నాయిడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో కలవరం

**మోసకారి మాటలు.. జీవితాలతో ఆటలు**

**ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు కుచ్చుటోపీ**

**లక్షల ప్యాకేజీలతోవల.. ఉద్యోగుల పేరిట లోన్లు**

**ఆ కొద్దిరోజులకు బోర్డు తిప్పేస్తున్న సంస్థలు**

**వరుస ఘటనతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో భయం భయం**




హైదరాబాద్, ఏప్రిల్ 18,ప్రభాతవార్త : గతంలో సైబర్ నేరాలు అనగానే గుర్తుకొచ్చే పేరు నైజీరియన్లు.. సైబర్ నేరాలు చేయడంలో వారిని మించినోళ్లు లేరు. అలాంటిది ఇప్పుడు మనదేశంలో రోజుకో కొత్తరకం నేరగాళ్లు పుట్టుకొస్తున్నారు. వీరు చేస్తున్న మాయ.. మోసం చూస్తే మనవాళ్ల మోసాలముందు నైజీరియన్లు బలాదూర్ అనిపించక మానదు. అలా కొత్త కొత్త మోసాలతో కోట్లు కొల్లగొడుతున్న కేటుగాళ్లు నగరంలో ఎంతో మంది అమాయకులు, నిరుద్యోగులు ఈ మోసగాళ్ల భారిన పడి లక్షల రూపాయలు పోగొట్టుకొని చివరకు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. తాజాగా బిటెక్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులను క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్న ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ నిరుద్యోగులను నిలువునా ముంచింది. చేసిన ఉద్యోగానికి జీతం చెల్లించక పోగా, పలువురు ఉద్యోగుల పేరుమీద లోన్లు తీసుకున్న సాఫ్ట్‌వేర్ సంస్థ చివరికి బోర్డు తిప్పేసింది. సంస్థ చేతిలో మోసపోయిన ఉద్యోగులు మంగళవారం గచ్చిబౌలిలోని సంస్థ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. గచ్చిబౌలిలోని ట్యూరింగ్ మైండ్స్ ఏఐ టెక్నాలజీ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు పలు రాష్ట్రాల్లోని బిటెక్, డిగ్రీ విద్యార్థులను క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపిక చేసింది. అందులో బిటెక్ పూర్తి చేసిన వారికి 6.2లక్షల ప్యాకేజీ, డిగ్రీ పూర్తి చేసిన వారికి 5.2లక్షల ప్యాకేజీ చొప్పున ఆఫర్ లెటర్లు ఇచ్చింది. మొదట గచ్చిబౌలి కార్యాలయంలో 9 నెలల పాటు ట్రైనింగ్ ఉంటుందని చెప్పి 700మందిని ఉద్యోగాల్లోకి తీసుకుంది. ఎంపికైన విద్యార్థులు గతకొన్ని నెలలుగా గచ్చిబౌలిలోని ఇన్ఫోసి సాఫ్ట్‌వేర్ సంస్థలో మూడు బ్యాచ్‌లుగా ట్రైనింగ్ తీసుకుంటూ స్థానికంగా ఉంటున్నారు. కాగా ట్రైనింగ్ మొదటి నెలలోనే ఇందులో 60మంది ఉద్యోగుల పేరుతో ఒక్కక్కరి మీద 4లక్షలు, మరో 50మంది ఉద్యోగుల పేరుతో ఒక్కక్కరి మీద 10 లక్షల చొప్పున ఆసంస్థ ప్రైవేటు బ్యాంకుల్లో లోన్లు తీసుకుంది. మరోవైపు ఉద్యోగులకు ప్రతినెల మొదటివారంలో స్టైఫండ్ పేరుతో 10వేల రూపాయలను అకౌంట్లలో జమ చేయగానే, వెంటనే లోన్ల పేరుతో ప్రైవేటు బ్యాంకులు సదరు డబ్బును కట్ చేసుకుంటున్నాయి. ఈ విషయమై ఉద్యోగులు సంస్థ ప్రతినిధుల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తుండగా, ప్రతిసారి ఏదో సాకుతో సంస్థ ప్రతినిధులు కాలం వెళ్లబుచ్చారని, ఈనేపథ్యంలోనే తమ వద్ద ప్రాజెక్టులు లేవని, అందరు ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నామంటూ ఆ మెయిల్స్ పెట్టింది. దీంతో మంగళ వారం వందలాది ఉద్యోగులు గచ్చిబౌలి కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. అలాగే గతేడాది హైదరాబాద్ కేంద్రం గా పనిచేస్తున్న ఫన్‌ల్యాబ్ టెక్నాలజీస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బిటెక్ ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలిస్తామంటూ వందలాది మంది నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేశారు. ఒకొక్కరి నుంచి 50వేల నుంచి 80వేల వరకు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపించారు. అపాయింట్ మెంట్ లెటర్స్ ఇచ్చిన నెలరోజుల్లోనే సంస్థ చేతులెత్తేసింది.

## వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి
### తెలంగాణ వీఆర్ఏ హక్కుల సాధన సమితి చైర్మన్ ఆర్.విజయ్



ధర్నాచౌక్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: వీఆర్ఏల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వీఆర్ఏ హక్కుల సాధన సమితి చైర్మన్ ఆర్.విజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ వీఆర్ఏ హక్కుల సాధన సమితి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.విజయ్ మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం వీఆర్ఏలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ 80 రోజులు సమ్మె చేశామని, 80 మంది వీఆర్ఏలను కోల్పోయామని, అయినా ఈ ప్రభుత్వంలో చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మునుగోడు ఎన్నికలు అవ్వగానే మీ సమస్యలు పరిష్కారం చేస్తూ జీవో విడుదల చేస్తానని హామీ ఇచ్చి ఆరునెలలు గుడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేస్కేలు అర్హత కలిగిన వీఆర్ఏలకు ప్రమోషన్లు, 55 సంవత్సరాల పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏల సమస్యలపై ప్రభుత్వం ఇంకా నిర్లక్ష్యం వహిస్తే బస్సు యాత్ర చేసి విఆర్ఎలను ఏకం చేస్తామని, అవసరమైతే ఆమరణదీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో విఆర్ఎ హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి అంబాల శ్రీధర్‌గౌడ్, నాయకులు లక్ష్మల్ల నరసింహారావు, దాసరి వీరన్న, షర్మిల, రాజయ్య, లింగరాజు, నార్ల శ్రీనివాస్, ఆరుట్ల బాలయ్య, ఎడ్ల మల్లయ్య, వివిధ జిల్లాల వీఆర్ఏలు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను పంపిణి చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ మంగళవారం సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో రూ. 40లక్షలకు పైగా విలువచేసే 20 మందికి షాది ముబారక్, 9 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ ఆడపిల్లల పెళ్లిళ్లు తల్లితండ్రులకు భారం కాకుండా ఏర్పాట్లు జరిపి, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. నిరుపేదల ప్రజల సంక్షేమానికి వివిధ సంక్షేమ పథకాలను అమలు జరుపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు సామలహేమ, రాసూరి సునిత, కందిశైలజ, నేతలు రామేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

## పాతబస్తీలో హెరిటేజ్ వాక్




రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విందా కుమార్ చార్మినార్ వద్ద జరిగిన హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న దృశ్యం

చార్మినార్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ పాతబస్తీలో చారిత్రక చార్మినార్ నుంచి చౌమహల్లా ప్యాలెస్ వరకు గత అనుభవాలను స్మరిస్తూ హెరిటేజ్ వాక్ కార్యక్రమం జరిగింది. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ, టిఎస్‌టిడి, జిహెచ్ఎంసి, ఎఎస్ఐ హైదరాబాద్ సర్కిల్, టిఎస్‌టిడిసి, జెబిఆర్‌ఏసి ఫోరమ్ ఫర్ బెటర్ హైదరాబాద్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన హైదరాబాద్ హెరిటేజ్ వాక్‌ను మంగళవారం ఉదయం చార్మినార్ వద్ద తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎంఎయుడి అర్విందా కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని 2022 నుంచి ప్రతీ ఆదివారం నగరంలో హెరిటేజ్ వాక్‌లను నిర్వహిస్తున్నామని తెలిపారు. వారసత్వ సంపదను కాపాడుకోవలసిన బాధ్యత మనం దరిపై ఉందని ఆయన తెలియజేశారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వేదకుమార్ మనికొండ మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని హైదరాబాద్ నగరంలో జరుపుకుంటున్నామని, తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపదను పరిరక్షించేందుకు అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. చార్మినార్ వద్ద ప్రారంభమైన హెరిటేజ్ వాక్ లాడ్‌బజార్, మోతీగల్లీ, ముర్గీచౌక్, ఇక్బాల్ ఉద్ దౌలా ప్యాలెస్, చౌమహల్లా ప్యాలెస్ వరకు కొన సాగింది. ఈ కార్యక్రమంలో డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వేదకుమార్ మణికొండ, ప్రొఫెసర్ జి.ఎస్.సూర్యనారాయణ మూర్తి, జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ ఎఎస్ఐ రాజేశ్వరీ, టిఎస్‌టిడి అధికారి చెరుపల్లి అంజయ్య, పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

### తమ్ముడి కోసం పరీక్ష రాసిన అన్నకు
## మూడు సంవత్సరాల జైలు శిక్ష

చార్మినార్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : తమ్ముడి కోసం పరీక్ష రాసిన అన్నకు మూడు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా నాంపల్లి కోర్టు విధించింది. కామాటిపుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కొమరయ్య కథనం ప్రకారం.. పాతబస్తీ బొందలగూడ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆసిం ఖాన్ 2017వ సంవత్సరంలో కులీకుతుబ్ షా పాలిటెక్నికల్ కళాశాలలో ఇంజనీరింగ్ పరీక్షకు సంబంధించి పేపర్ వన్ మ్యాథ్స్ పరీక్ష రాయవలసి ఉంది.కాగా ఆసింఖాన్‌కు బదులుగా అతని అన్న మహ్మద్ సోహెల్ ఖాన్ అలియాస్ ఆదిల్ ఖాన్ పరీక్ష రాస్తుండగా ఇన్విజిలేటర్లకు పట్టుబడ్డాడు. కోర్టులో కేసుకు సంబంధించిన సాక్ష్యాలను పోలీసులు నిరూపించారు. నాంపల్లి సిఎమ్ఎమ్ డి.దుర్గాప్రసాద్ తమ్ముడి కోసం పరీక్ష రాసిన అన్న మహ్మద్ సోహెల్ ఖాన్ అలియాస్ ఆదిల్ ఖాన్‌కు మూడు సంవత్సరాలు సాధారణ జైలు శిక్షతో పాటు 10 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని కామాటిపుర ఇన్‌స్పెక్టర్ కొమరయ్య తెలిపారు.

### మహిళ అదృశ్యం

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : మహిళ అదృశ్యమైన సంఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్‌పెక్టర్ ముత్తు యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. కార్మికనగర్‌లో నివశిస్తున్న బాలామణి (55) ఏప్రిల్ 11వ తేదీనా కనిపించకుండాపోయింది. ఆమె కుమారుడు నగేష్ ఆందోళనకు గురై చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో వెతికినా కనిపించకపోవడంతో సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు.

## ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**కార్పోరేటర్ ముద్దం నర్సింహాయాదవ్**

బేగంపేట ఏప్రిల్ 18,ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పోరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఓల్డ్‌బో యిన్ పల్లి డివిజన్ పరిధిలోని హెచ్‌ఏఎల్ కాలనీ, సాయినారాయణపురి కాలనీ,శంకర్ ఎన్‌క్లేవ్, ఆర్ఆర్‌నగర్‌లలో కార్పోరేటర్ ముద్దం మంగళవారం పర్యటించారు. ప్రజలతో మమేకమయ్యారు.ఈ సందర్భంగా హెచ్‌ఏఎల్ కాలనీలో స్థానికులు తమకు బీటీ రోడ్డు కావాలని, పార్క్‌లో బోర్‌వెల్ రిపేర్ చేయించాలని, చెత్త సమస్య పరిష్కరించాలని, ఎంఎంఆర్ గార్డెన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని ముద్దం దృష్టికి తీసుకు వచ్చారు.అలాగే సాయినారాయణపురి కాలనీలో విద్యుత్ సమస్య ఉందని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ అరవింద్ కుమార్,శ్రీకాంత్, వాటర్‌వర్క్స్ మేనేజర్ తేజ, ప్రకాష్,ఎలక్ట్రిసిటీ లైన్ ఇన్స్‌పెక్టర్ డికెఎల్ రెడ్డి కృష్ణ, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి జస్వంత్, సీ ఓ మైపాల్‌రెడ్డి, అరుణ శ్రీనివాస్, గురుస్వామి, బీఆర్ఎస్ నాయకులు మన్నె ఉదయ్‌యాదవ్,బుర్రి యాదగిరి,మల్లేష్ యాదవ్, శ్రీనివాసరెడ్డి, ఉదయ్ మట్టి శ్రీనివాస్,దుర్గాకుమార్, రాంబాబు, రాజ్‌కుమార్, శేఖర్, నరసింహ,సుధాక ర్‌రెడ్డి, ప్రభాకర్, గణేష్‌యాదవ్, శేఖర్‌రెడ్డి, మహేందర్‌నాథ్ యాదవ్, సుబ్రమణ్యం, ముఖేష్ పవర్ కరుణాకర్‌రెడ్డి, రామకృష్ణ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హెచ్‌ఏఎల్ కాలనీలో పర్యటిస్తున్న కార్పోరేటర్ ముద్దం

## చర్లపల్లిలో మొబైల్ బస్‌పాస్ కౌంటర్ : బస్‌పాస్ సెక్షన్ మేనేజర్ మహేశ్

కంటోన్మెంట్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త: నగర శివారు ప్రాంతాలైన చర్లపల్లి పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న బస్ పాస్ వినియోగదారుల సౌకర్యార్థం చర్లపల్లిలో మొబైల్ బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సికింద్రాబాద్ బస్‌పాస్ సెక్షన్ మేనేజర్ బి.మహేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ రైతిఫైల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగర శివారు ప్రాంతాల్లో ఉన్న చర్లపల్లి చుట్టుప్రక్కల ప్రాంతాల వాసుల సౌకర్యార్థం చర్లపల్లి ప్రాంతంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొబైల్ బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బస్ పాస్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చున్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం.. జాగ్రత్తగా ఉండాలి



ఫ్రీ మెగా మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్న గౌతంరావు, మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: ఆరోగ్యమే మహాభాగ్యమని ఈ విషయాన్ని ఎవరు మరిచిపోరాదని, ఆరోగ్యాన్ని మించిన ఆస్తీ మరోకటి లేదని బిజెపి హైదరాబాద్ జిల్లా సెంట్రల్ జోన్ అధ్యక్షుడు డా.ఎన్. గౌతంరావు, హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ స్పష్టం చేశారు. రోజురోజుకు మారుతున్న కాలంతో పాటు కొత్త, కొత్త రోగాలు పెరుగుతున్నాయని ఈ రోగాలు మనిషిని పిల్చి పంపిచేస్తున్నాయని, చివరికి ప్రాణాలను హరించివేస్తునాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహమ్మారి కరోనా లక్షలాది మందిని పొట్టన పెట్టుకుని ప్రపంచాన్ని నాశనం చేసిందన్నారు. డివిజన్‌లోని వెంకటేశ్వరకాలనీలో ఫ్రీ మెగా మెడికల్ క్యాంప్‌లో పాల్గొని వారు మాట్లాడారు. ఇలాంటి మెడికల్ క్యాంప్‌లను ప్రజలు వినియోగించుకుంటూనే ఎప్పటికప్పుడు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారు సూచించారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడటానికి ప్రభుత్వాలు కొత్త కొత్త పథకాలను చేపడుతున్నాయని వాటిని కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామన్‌గౌడ్, మల్లేష్, సందీప్, కొండయ్య, ప్రవీణ్, ప్రకాష్, హితేష్, జయరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, జీహెచ్‌ఎంసీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై మంగళవారం ఆయా శాఖ అధికారులతో ఎమ్మెల్యే కెపి వివేకానంద్ పేట్‌బషీరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన అధికారులతో నియోజవర్గంలోని పలు ప్రాంతాలలో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.84కోట్లు, జీహెచ్‌ఎంసీ పరిధిలో 95కోట్లతో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులు 85శాతం పూర్తయ్యాయని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో కోట్ల రూపాయల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపించకుండా త్వరగా పూర్తి చేయాలని,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వర్షాకాలం వరకు పనులన్ని సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ఆనంద్, ఈఈలు నారాయణ, కృష్ణచైతన్య, డీఈఈలు నరేందర్, నళిని, ఏఈలు రామారావు, నాగరాజు, లక్ష్మీనారాయణ కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్,కార్పొరేటర్లు రవికిరణ్, సురేష్‌రెడ్డి, ఆగం రాజు, ఆగం పాండు, కాసాని సుధాకర్, జ్యోతి, నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి,కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## రిఫండ్ కోసం ఫిర్యాదు చేస్తే అకౌంట్‌లోని నగదు ఖాళీ

బేగంపేట ఏప్రిల్ 18, ప్రభాతవార్త : రిఫండ్ కోసం ఫిర్యాదు చేస్తే అకౌంట్‌లోని డబ్బు ఖాళీ అయిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఈ ఘటనపై పోలీసుల కధనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బేగంపేట రసూల్‌పురా కు చెందిన బి.సురేష్‌బాబు ఆన్‌లైన్‌లోని మీషో అప్లికేషన్ ద్వారా జనవరి నెలలో కొన్ని వస్తువులను ఆర్డర్ చేసాడు.జనవరి 24వ తేదీన తను ఆర్డర్ చేసిన వస్తువులు వచ్చాయి.తనకు వచ్చిన బాక్సు తెరచి చూస్తే అందులో ఏమి లేకుండా ఖాళీ పెట్టెఉంది.వెంటనే డెలివరీ బాయ్‌కి తను ఆర్డర్‌ను వాపస్ చేసాడు.గూగుల్‌లో మీషో అప్లికేషన్ కస్టమర్ కేర్ నెంబరు తెల్సుకున్నాడు.కస్టమర్ కేర్ నెంబర్ కనిపించిన వెంటనే 8918305297కు ఫోన్ చేసాడు.తనకు తాను కస్టమర్ కేర్ ప్రతినిధిగా పరిచయం చేసుకున్న రాహుల్ శర్మ కు తన ఆర్డర్ గురించి ఫిర్యాదు చేసాడు.తాను చెల్లించిన సొమ్మును తిరిగి పంపడానికి బ్యాంకు ఖాతా వివరాలను రాహుల్ శర్మ అడగడంతో సురేష్‌బాబు ఇచ్చాడు.అయితే రిఫండ్ రాకపోవడంతో మళ్లీ ఫోన్ చేసాడు.ఈ సారి ఫోన్‌పే యూపిఐ పిన్ వివరాలను చెప్పాలని కోరడంతో చెప్పాడు.మూడు రోజుల్లో మీ అమౌంట్ మీకు వస్తుందని రాహుల్ శర్మ చెప్పడంతో సురేష్ బాబు నమ్మాడు. అయితే రిఫండ్ రాకపోవడంతో పాటు అతని అకౌంట్‌లో నుంచి రూ 82,301లు గల్లంతయ్యాయి.ఈ ఘటనపై బాధితుడు సురేష్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 4లైన్ల రహదారి విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలి

**చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి**



తెలంగాణ పోలీసు అకాడమి నుంచి మన్నేగూడ వరకు చేపడుతున్న 4.లైన్ల రహదారి విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు తెలుపుతున్న ఎంపి రంజిత్‌రెడ్డి

నార్సింగి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమి నుంచి మన్నేగూడ వరకు చేపడుతున్న 4.లైన్ల రహదారి విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలని చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ రహదారి విస్తరణ పనులపై మంగళవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ హరీష్, నేషనల్ హావే అథారిటి ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ నాగేశ్వర్‌రావ్, చేవెళ్ల రెవెన్యూ సిబ్బంది, మెగా ఇంజనీరింగ్ సిబ్బందితో ఎంపి రంజిత్‌రెడ్డి సమీ క్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ రహదారి విస్త రణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, దీంతో నిత్యం రాజధాని హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని తెలిపారు. మన్నేగూడ నుంచి లంగర్‌హౌస్ వరకు 60.కిలోమీటర్ల దూరం ఉంటుందని, సాధారణంగా అయితే ఈ దూరం కేవలం గంట సమయంలోనే ప్రయాణీకులు చేరుకుంటారు. కానీ విస్తరణ పనుల కారణంగా రెండు గంటల సమయం పడుతుందని, బండెంట బండి కట్టి అన్న చందంగా వాహనాలు నిదానంగా వెళ్లాల్సి వస్తుందన్నారు. వీలైనంత త్వరగా ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాలని అధికారులకు ఎంపి రంజిత్‌రెడ్డి ఆదేశించారు.

## అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయం

జీడిమెట్ల, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన,అగ్నిమాపక శాఖ అధికారులు మంగళవారం జీడిమెట్ల ఫైర్ స్టేషన్‌వద్ద నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాలకి ముఖ్య అతిధులుగా మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మంటలను అదుపు చేసి ఇతరుల ప్రాణాలు కాపాడుతున్న అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. డీజీఎఫ్ఎస్ వై.నాగిరెడ్డి, డీఎఫ్ఎస్ లక్ష్మీప్రసాద్, అడిషనల్ డైరెక్టర్ నారాయణరావు, రీజనల్ ఫైర్ అధికారి పాపయ్య, డిస్ట్రిక్ట్ ఫైర్ అధికారి సుధాకర్‌రావు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ క్రీడా మైదానాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలి



కంటోన్మెంట్ క్రీడామైదానాలను సందర్శిస్తున్న జంపనప్రతాప్

కంటోన్మెంట్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న క్రీడా మైదానాల్లో కనీస వసతులు మెరుగుపర్చాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపప్రతాప్ తెలిపారు. మంగళవారం కంటోన్మెంట్‌లోని బోయిన్‌పల్లి మట్‌పోర్ట్, తిరుమలగిరి, బొల్లారం ప్రాంతాల్లో ఉన్న క్రీడా మైదానాలను ఆయన సందర్శించారు. ఆయా క్రీడా మైదానాల్లో మంచినీరు, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని సిఈఓ దృష్టికి తెస్తామన్నారు. ఈ నెల 30 నుంచి కంటోన్మెంట్‌లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో కంటోన్మెంట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ క్రీడాకారులు, దఫేదార్ రాజేశ్ పాల్గొన్నారు.

## బండ బస్తీ సమస్యలు పరిష్కరిస్తాం

**అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి**



బస్తీ పాదయాత్రలో కార్పొరేటర్

అల్వాల్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: బండ బస్తీ సమస్యలు అన్నింటికి పరిష్కారం చూపుతామని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం బస్తీలో జలమండలి ఇంజనీరింగ్ శానిటేషన్ విభాగాలకు చెందిన అధికార యంత్రాంగంతో కలిసి కార్పొరేటర్ పాదయాత్ర చేయడం జరిగింది. మురికి కాలువలు వరద నీటి సమస్యలను ప్రధానంగా కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేసి బస్తీ వాసుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని శాంతి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బండ బస్తీలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. రోడ్లు డ్రైనేజీ మంచినీరు వంటి కనీస వసతులను కల్పించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ మల్లికార్జున్ శేఖర్ రామారావు అరవింద్ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



రంజాన్ తోఫాలు అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ సలావుద్దీన్ లోధీ,టి.రవీశ్వర్‌రావు,నిమ్మగడ్డ రమేష్ తదితరులు

చార్మినార్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ, పురానాపూల్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు టి.రవీశ్వర్‌రావు,ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌లు అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా కోకాకితట్టిలోని మూసా ఖాద్రి దర్గా ఆవరణలో మంగళవారం వారు మైనార్టీలకు ప్రభుత్వం తరుపున రంజాన్ పండుగ తోఫాలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని పండుగలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు.బిఆర్ఎస్ నాయకులు జహంగీర్,మెహజబీన్ ఖురేషీ, వేణు, చంద్రశేఖర్‌తో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తిరుమలనగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర



అధికారులతో మాట్లాడుతున్న లావణ్యశ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: గోల్నాక డివిజన్‌లోని తిరుమలనగర్‌లో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు బుధవారం స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్ళారు. ఆమె వెంటనే స్పందించి వివిధ శాఖల అధికారల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని కోరారు. ఈ పాదయాత్రలో ఆమెతోపాటు అధికారులు ప్రవీణ్‌కుమార్, మనోహార్, భాస్కర్, రోహిత్, సతీష్, పాండు, కృష్ణ, రమేష్, మల్లికార్జున్, కమిటి సభ్యులు సత్యనారాయణ, టి.రాంచందర్, ఆర్.జైహింద్, వి.కృష్ణారెడ్డి, రాజు, అరవింద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

### మానిక్ రావ్ థాక్రే

కంటోన్మెంట్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేస్తే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మానిక్ రావ్ దాక్రే తెలిపారు. సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ ఓబిసి ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్ మంగళవారం దా క్రేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

### నాయిని నర్సింహారెడ్డి మెమోరియల్

## క్రికెట్ లీగ్ పోస్టర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: నాయిని నర్సింహారెడ్డి మెమోరియల్ క్రికెట్ లీగ్‌కు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం నిర్వాహక సంస్థ అధినేత బిఆర్ఎస్ రాష్ట్ర నేత వి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ ఆవిష్కరించారు. ఇందిరాపార్కు వద్ద ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో ఈ క్రికెట్ లీగ్ పోటీలు మే 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరుగుతాయి. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత రేషం మల్లేష్, సిరిగిరి శ్యామ్, సిరిగింరి కిరణ్, కార్తీక్‌యాదవ్, నేతా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఒకరి అరెస్ట్

బేగంపేట ఏప్రిల్ 18,ప్రభాతవార్త : క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడుతున్న ఒకరిని బేగంపేట పోలీసులు అరెస్ట్ చేసారు. పోలీసుల కధనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఐపీఎల్ క్రికెట్ పోటీల్లో చెన్నై సూపర్ కింగ్స్ బెంగుళూరు రాయల్ ఛాలెంజర్స్ మధ్య జరిగే క్రికెట్ పోటీల సందర్భంగా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.సోమవారం రాత్రి బేగంపేట ఎస్సై కె.గౌతమి వారి సిబ్బంది బేగంపేట అన్నానగర్ లోని ఖాళీమాత ఆలయం సమీపంలోని ఓ ఇంటిపై దాడి చేశాడు.పెమ్మర్తి బాబేందర్(31),అనే వ్యక్తి బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు.గూగుల్ క్రోమ్ నుంచి డౌన్లోడ్ చేసుకున్న బెట్టింగ్ యాప్‌ల ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి నిందితుడిని అరెస్ట్ చేసారు.అతని వద్ద నుంచి రూ లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.శ్రీనివాసులు తెలిపారు.

## కార్మికలహక్కుల సాధన కోసం తెలంగాణ కార్మిక సమాఖ్య కృషి



ప్రసంగిస్తున్న తెలంగాణ కార్మిక సమాఖ్య(టికెఎస్) అధ్యక్షుడు కె.పరుశురామ్

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: తెలంగాణ కార్మిక సమాఖ్య(టికెఎస్) ఆధ్వర్యంలో రాజకీయ రౌండ్‌టేబుల్ సమావేశం మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి రామన్న, రాష్ట్ర అధ్యక్షుడు కన్నారపు పరుశురామ్ హాజరై ప్రసంగించారు. రాబోయే ఎన్నికల్లో ఈ సందర్భంగా సమావేశంలో పలు డిమాండ్లను ఆమోదించారు. కార్మికుల హక్కుల సాధన కోసం సమాఖ్య కృషి చేస్తుందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని, అదే విధంగా కార్మికులకు సంబంధించిన హక్కుల కోసం తమ సమాఖ్య కృషి చేస్తుందని అన్నారు. రాజకీయంగా బలోపేతంగా అవడానికి సమాఖ్య కృషి చేస్తుందన్నారు.

## నేడు వరల్డ్ లీవర్ డే.. ఆందోళన కలిగిస్తున్న ఫ్యాటీ లీవర్

**బీపీ,షుగర్,అధిక బరువు ఉంటే జాగ్రత్తలు తప్పని సరి : డాక్టర్ విమలాకర్‌రెడ్డి**

బేగంపేట ఏప్రిల్ 18,ప్రభాతవార్త : రోజు రోజుకు పెరుగుతున్న ఫ్యాటీ లివర్ కేసులు ఆందోళణ కలిగిస్తున్నాయి. బీపీ,షుగర్, అధిక బరువు తో బాధపడుతున్న వారి సంఖ్య అధికంగా ఉంటుంది.మన భారతదేశంలో 18-32శాతం మంది ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. వీరిలో 31శాతం మంది లివర్ పనిచేయకుండా చివరి స్టేజీకి చేరుకోగా 8శాతం మందికి లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సిన స్టేజీకి చేరుకుంటున్నారని, సికింద్రాబాద్ పరిధిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, ల్యాప్రోస్కోపిక్ అండ్ బేరియాట్రిక్,లివర్ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ డాక్టర్ విమలాకర్‌రెడ్డి తెలిపారు.వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఈ వరల్డ్ లివర్ (ఏప్రిల్ 19) డే సందర్భంగా ఫ్యాటీ లివర్ గురించి ఆయన కొన్ని సూచనలు చేసారు. ఫ్యాటీ లివర్ గురించి జాగ్రత్తగా ఉండాలని,రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవాలని, ఇది ఎవరికైనా ఎఫెక్ట్ చేయవచ్చు, అనే థీంను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందన్నారు. ఫ్యాటీ లివర్ షుగర్, బీపీ, అధిక బరువు, మెటబాలిక్ సిండ్రోమ్ వల్ల లివర్‌లో కొవ్వు చేరుతుంది.లివర్ సాధారణంగా మన శరీరంలో నిత్యం 250 పనులు చేస్తుంది. లివర్‌కు సమస్యలు తలెత్తితే జాండీస్, కడుపులో నీళ్ల చేరడం,కాళ్ల వాపులు,రక్త వాంతులు,మనిషి స్పృహ తప్పి పోయే లక్షణాలు కనిపిస్తాయి.ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే అది లివర్ ఫెయిల్యూర్‌కు దారి తీస్తుంది. మీరు ఆల్కహాలిక్ కాకపోయినా ఎటువంటి వైరస్ ఇన్‌ఫెక్షన్ సోకకపోయినా కేవలం మీరు లావుగా ఉండటం,షుగర్,బీపీ కొలెస్ట్రాల్ కంట్రోల్‌లో లేకపోవడం వల్ల కూడా లివర్ చెడిపోయే స్థాయికి చేరుతుంది.తరుచుగా ఆల్ట్రాసౌండ్,ఫైబ్రో స్కాన్ చేయడం వల్ల లివర్‌లో ఎంత కొవ్వు చేరిందని తెల్సుకునే వీలుంది.

లీవర్ ఫంక్షన్ టెస్ట్,బీపీ,షుగర్ చెక్ చేసుకుంటూ కొలెస్ట్రాల్‌కు సంబంధించిన మందులు వాడుతూ బరువు మీ బాడీ మాస్ ఇండెక్స్ ప్రకారం ఉంచుకోవడం ద్వారా ఫ్యాటీ లివర్ నుంచి జాగ్రత్త పడవచ్చు. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టును సంప్రదించి సరియైన చికిత్స తీసుకుంటే ఫ్యాటీ లివర్ బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు.

## బస్తీలకు సీవరేజ్ పైప్ లైన్ వర్క్స్ మంజూరు చేయాలి

**జలమండి ఎండి దాన కిశోర్‌కు కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి వినతి**

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, జిహెచ్‌ఎంపి బిజెపి కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం హెచ్‌ఎమ్ డబ్ల్యుఎస్, ఎస్‌బి మేనేజింగ్ డైరెక్టర్ దాన కిశోర్‌ను కలిసి డివిజన్‌కు సంబంధించిన వాటర్ సమస్యలు, పలు బస్తీలకు సీవరేజ్ పైప్ లైన్ వర్క్స్ మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పడిన బస్తీలు చాలా ఉన్నాయని ప్రకాష్ నగర్ కాలనీ, బృందావన్ కాలనీ, లక్ష్మీగూడ ఫేస్ 1,2,3,పద్మశాలి పురం,టాటానగర్, ఎన్‌టిఆర్ నగర్, న్యూ భవానీ కాలనీలకు ఎస్‌డబ్ల్యుజి పైప్ లైన్ పనులకు నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరటం జరిగిందని ఆయన తెలిపారు. జలమండలి ఎండి దాని కిశోర్ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యను అందించినప్పుడే పోటీ తత్వం పెరుగుతుంది

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించటంతో పాటు వారిలో పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు వివిధ పరీక్షలు నిర్వహించటం జరుగుతుందని శ్రీనిధి విశ్వభారతి డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్ అన్నారు. మధురానగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి స్వీట్ ఎంజెల్స్‌లో సుచీర్ ఇండియాస్, సర్ సీవీరామన్ నిర్వహించిన జాతీయ రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల్లో శ్రీనిధి విశ్వభారతి హైస్కూల్ నుంచి స్వీట్ ఎంజెల్స్ స్కూల్ నుంచి విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి జాతీయ, రాష్ట్ర, జోనల్, జిల్లా స్థాయిలో ఉత్తీర్ణులుగా నిలచారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో ఐదవ తరగతి చెందిన ధ్వనిత రెండవ ర్యాంకు సాధించగా జోనల్ స్థాయిలో మొదటి ర్యాంకు గ్రహిత రెండవ తరగతికి చెందిన కె.మోక్షిత, రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకు గ్రహిత మూడవ తరగతికి చెందిన ఈశ్వరసాయి, జిల్లాస్థాయిలో 1వ తరగతికి చెందిన హర్షియ, 7వ తరగతికి చెందిన సలోమి మొదటి ర్యాంకులు సాధించారు. ఇందుకుగాను సుచీర్ ఇండియా, సర్ సీవీరామన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డులను ఇవ్వటం జరిగింది. వీరిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గీత, వైస్ ప్రిన్సిపల్ విమల, రాజేశ్వరి, కోఆర్డినేటర్ సాయిరామ్, భవానితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనంకు పెద్ద ఎత్తున తరలి రావాలి : ముఠా గోపాల్



ధర్నాచౌక్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: ఈనెల 25న జరగబోయే ముషీరాబాద్ ఆత్మీయ సమ్మేళనంకు ముషీరాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ముషీరాబాద్ నియోజకవర్గ సీనియర్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 25 వ తేదీ జరగనున్న ఆత్మీయ సమ్మేళనం విజయవంతంగా నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో యువనేత ముఠా జైసింహ, సీనియర్ నాయకుడు రెబ్బ రామారావు, డివిజన్ అధ్యక్షుఉల రాకేష్, శ్యాం యాదవ్, నర్సింగ్ ప్రసాద్, నాయకులు ముఠా నరేష్, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీధర్‌చారి పాల్గొన్నారు.

## 20 రోజుల్లోగా జవహర్‌నగర్ ప్రధాన రహదారి పనులు పూర్తి చేయాలి : మేయర్ కావ్య



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ కావ్య, అధికారులు

జవహర్‌నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : జవహర్‌నగర్ ప్రధాన రహదారి పనులను 20 రోజుల్లో పూర్తి చేయాలని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ 20 రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారని తెలిపారు. గడువులోగా రోడ్డు పనులు పూర్తయితే జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు మరో 30 కోట్ల రూపాయలు మంజూరు చేస్తానని మంత్రి కేటీఆర్ ఇటీవల జరిగిన సభలో హామీ ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు రోడ్డు పనులను 20 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈఈ మురళి, ఏఈ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## గంగా జమున తెహజీబ్ సంస్కృతి పరిఢవిల్లుతుంది : కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు, కార్పొరేటర్

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో గంగా జమున తెహజీబ్ సంస్క1తి పరవడిల్లుతుందని సనత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం రంజాన పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్రమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సనత్‌నగర్ వెల్ఫేర్ గ్రౌండ్లఓ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ తలసాని సాయికిరణ్ యాదవ్ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సర్ఫ్ సంతోష్ ఖలీల్ బేగ్, ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, షఫి అహ్మద్, షమీపుల అంజాద్, ఇబ్రమీం, వసిం, చక్రీ, నోమన్, జమీర్‌బేగ్, రాజేష్ ముదిరాజ్, ఇమ్రాజ్, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ భావజాలం వైపు ప్రయాణం చేయాలి

**రిటైర్డ్ ఐఎఎస్ అధికారి గోపాల్‌రావు**

**రాజ్యాంగాన్ని దిక్కరించిన ఏ ప్రభుత్వానికి పాలించే హక్కులేదు: పిఎస్ఎన్ మూర్తి**



సదస్సులో ప్రసంగిస్తున్న పిఎస్ఎన్ మూర్తి. చిత్రంలో గోపాల్‌రావు, గడ్డం ఝాన్సీ తదితరులు

సైఫాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతిలు, వర్ధంతిలు చేస్తున్నాం కాని ఆయన భావజాలం వైపు ప్రయాణం చేయడం లేదని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి గోపాల్‌రావు అన్నారు. ఆయన ఆలోచనకు అనుగుణంగా ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో బుధవారం లక్డికాపూలోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో 'అంబేద్కర్ ఆలోచనా విధానం-ప్రస్తుత పాలనా వ్యవస్థ' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజల ఆస్తులు సమానంగా ఉండాలని అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో పొందుపరచకపోతే ఈ దేశంలో ప్రజాస్వామ్యం అనేది ఉండేది కాదన్నారు. అంబేద్కర్ ప్రధానంగా స్త్రీ స్వేచ్ఛకోసం తపించారని దళిత స్త్రీ శక్తి ఆపని చేస్తుందని ఇదే అంబే ద్కర్ వాదమన్నారు. ప్రొఫె సర్ సుధారాణి మాట్లాడుతూ ప్రపంచమంతా విశ్వమానవుడిగా అంబేద్కర్‌ను గుర్తించారని దేశంలో మాత్రం అంబేద్కర్ అశయాలను నేరవేరడంలేదన్నారు. కుల వ్యవస్థ ఉన్నచోట సామాజిక ఆదర్శవంతమైన సమాజం ఏర్పడదన్నారు. పేద వర్గాలు ఆత్మ మా న్య తా భా వా న్ని విడనాడి ఎన్నికల సమయంలో కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఐడిఎఎస్ రిటైర్డ్ అధికారి పిఎస్ఎన్ మూర్తి ప్రసంగిస్తూ అంబేద్కర్ ఆలోచనా విధానం ప్రకారమే పార్లమెంట్, అసెంబ్లీల ప్రజా ప్రతినిధులు, గవర్నర్లు మెలగాలని రాజ్యాంగాన్ని దిక్కరించిన ఏ ప్రభుత్వం పాలనకు అర్హతలేదన్నారు. ఈ సదస్సుకు దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ అధ్యక్షత వహించగా సదస్సులో రాష్ట్ర కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, వెంకట్‌రెడ్డి, మాణిక్యం, సజయ, వంగపల్లి పద్మ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



మోండా మార్కెట్‌లోని శ్రీ భూ వరహా స్వామి వారికి పట్టు వస్త్రాలు, పూజా సామాగ్రిని సమర్పిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక, ఆలయ చైర్మన్ వై.నర్సారెడ్డి తదితరులు

## భూ వరహా స్వామి ఆలయంలో ఘనంగా సుదర్శన హోమం

భారీగా తరలివచ్చిన భక్తులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: సికింద్రాబాద్, శివాజీ నగర్ కోనేరు వీధిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సుదర్శన భూ వరహా స్వామి జయంతి వేడుకల్లో భాగంగా మంగళ వారం నిర్వహించిన సుదర్శన హోమంకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూర్ణాహుతిలో సమర్పించాల్సిన వస్త్రాలు, పూజా సామాగ్రి వరహా స్వామి నుండి టీటీడి దేవస్థానానికి తీసుకెళ్లి స్వామి వారికి చూపించుకొని వరహా స్వామి గుడిలో సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, శ్రీ వెంకటేశ్వర పెరుమాల్ దేవాలయం చైర్మన్ వై.నర్సారెడ్డి, ఆలయ ఈఓ సత్యమూర్తి, ధర్మకర్తలు, బిఆర్ఎస్ నాయకులు తేజ్‌పాల్, కాశిరెడ్డి, నరేశ్, అజయ్ పాల్గొన్నారు.

## పండుగలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి : జక్కుల మహేశ్వర్ రెడ్డి



1వ వార్డు బోయిన్‌పల్లిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న జక్కుల మహేశ్వర్ రెడ్డి తదితరులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: పండుగలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి పెన్షన్‌లైన్, కంసరి బజార్ ప్రాంతాల్లోని మజీదిలలో నిర్వహించిన ఇఫ్తార్ విందు వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్, విజయ్, ముస్లిం మైనార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నాచారం హెచ్ఎంసీ మసీద్ వద్ద రంజాన్ తోఫాల పంపిణి



రంజాన్ తోఫాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేతిసుభాష్‌రెడ్డి

నాచారం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: ప్రభుత్వం అందజేసే రంజాన్ తోఫాలను నాచారం హెచ్‌ఎంటీ వద్ద ఉన్న మసీద్ ఈ బిలాల్ వద్ద మైనార్టీలకు ఎమ్మెల్యే భేతిసుభాష్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ తో కలిసి పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలు, కులాలను గౌరవిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యం రెడ్డి, కట్టబుచ్చన్న గౌడ్, సాయిజన్‌శేఖర్, మసీదు కమిటీ సభ్యులు ఖధీర్, ఇక్బాల్, జావీద్, మజర్, షేక్ రఫీక్ తధితరులు పాల్గొన్నారు.

### గాంధీఆస్పత్రిలో శిశువుకు అరుదైన ఆపరేషన్

సికింద్రాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్ జరిపి ఓ చిన్నారి ప్రాణాన్ని కాపాడారు. గతనెల 29న 9 నెలల వయస్సు గల నాన్ సిండ్రోమిక్ ఆడ శిశువుకు కుడి, ఎడమ స్పేరింగ్ సర్జరి (కుడి, ఎడమ పార్షియల్ నెఫ్రెక్టమి) గాంధీ ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ కే. నాగార్జున, హెచ్ఓడి నేతృత్వంలోని పిడియాట్రిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో విజయవంతంగా జరిపారు. శిశువు కుటుంబ సభ్యులు మంగళవారం సర్జరీ జరిపిన డాక్టర్లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సర్జరీ జరిపిన వైద్యులను ఆస్పత్రి సుపరింటెండెంట్ డాక్టర్ రాజారావు అభినందించారు.

# సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



దేవాదాయశాఖ అధికారులతో సమావేశమైన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

అడ్డగుట్ట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని ముషీరాబాద్ చౌరస్తా సమీపంలో గల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని అత్యుతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పశుసంవర్థక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. గత నెలలో శ్రీ రామనవమి సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఈ ఆలయంలో స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. రహదారి పక్కనే ఉన్న ఆలయాన్ని అభివృద్ధి చేసి ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు మంగళ వారం మంత్రి నివాసంలో దేవాదాయశాఖ అధికారులతో ఆలయ అభివృద్ధి పనులనపై సమీక్షించారు. ప్రస్తుతం ఆలయానికి 3200 గజాల స్థలం ఉందని, దానిని పరిగణలోకి తీసుకొని సీతారాములు, ఆంజనేయస్వామి ఆలయాల నిర్మాణానికి రోడ్‌వైపు షాప్స్ నిర్మాణం చేపట్టే విధంగా ప్రణాళికలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ఆలయానికి అనుకొని ఉన్న కొంత ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. దేవాదాయశాఖ, ఇంజనీరింగ్ అధికారులు బుదవారం ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్దం చేయాలని ఆదేశించారు. త్వరలోనే మంత్రి దేవాదాయ శాఖ కమిషనర్‌తో కలిసి ఆలయ పునర్నిర్మాణ, అభివృద్ధి పనులు పూర్తయిన తరువాత ప్రస్తుతం ఉన్న షాప్స్ నిర్వాహకులకే ఇచ్చే విధంగా అగ్రిమెంట్ చేసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యాక్రమంలో హేమలత, లక్ష్మీపతి, పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, ఆలయ ఈఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

మెహిదీపట్నం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ కోరారు. ఆసీఫ్‌నగర్ మండల పరిధిలోని లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం కార్వాన్ ఏకెఎం.ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లడంతోనే అదిసాధ్యమవుతుందన్నారు. ఏకెఎం ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో 145 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో నానల్‌నగర్, కార్వాన్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, స్వామియాదవ్, ఆసీఫ్‌నగర్ డిప్యూటీ తహశీల్దార్ ప్రదీప్‌రెడ్డి, ఆర్ఐ సురేష్ స్థానిక నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 49 లక్షలతో పైప్‌లైన్ పనులు ప్రారంభం



డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

హైదరాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: నల్లకుంట డివిజన్‌లోని స్ట్రీట్ నెంబరు 7లో 49 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అమృత కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహనీయుల కృషి గురించి అందరు తెలుసుకోవాలి

ఓయు వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్



అంబేద్కర్ జయంతి వేడుకల్లో వైస్ చాన్సలర్, రిజిస్టార్ ఉద్యోగులు

తార్నాక, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: మహనీయులు చేసిన కృషి గురించి అందరు తెలుసుకోవాలని ఓ.యూ వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. ఎన్జీవోస్ స్టాఫ్ అసోషియేషన్, టెక్నికల్ స్టాఫ్ అసోషియేషన్, ఎంప్లాయిస్ యూనియన్ ఉస్మానియా యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఓ.యూ సెనేట్ హాల్లో డా.బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్, రిజిస్టార్ ప్రొ.లక్ష్మినారాయణ, ప్రొ.గడ్డం మల్లేశం, ప్రొ.మంగునాయక్‌తో పాటు పలువురు అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి ప్రొ.రవీందర్ యాదవ్ మాట్లాడుతూ అంబేద్కర్ అందరి వారని కొనియాడారు. సమాజ హితం కోసం వారు చేసిన కృషి గురించి చర్చించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓ.యూలో గతంలో ఎన్నడు లేనివిదంగా మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్ అధ్యక్షులు బియాని జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎ.రవి, టెక్నికల్ స్టాఫ్ అసోషియేషన్ ప్రసిడెంట్ కె.నాగరాజా రావు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శివశంకర్, ప్రధాన కార్యదర్శి అక్బర్ బేగ్, బీమయ్య, అశోక్‌కుమార్, బీమ్‌రావ్, రాకేష్, కిష్టా, జలాల్, ఇక్బాల్, రాజేశ్వర్, రాజేష్, గోపాల్‌తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## కులమతాలకతీతంగా పండుగలు



బోరబండ సైట్3లో రంజాన్ కానుకలను అందజేస్తున్న జూబ్లీహిల్స్ శాసనసభ్యులు మాగంటి గోపీనాథ్

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఏ పండుగనైనా కుల మతాలకు అతీతంగా జరుపుకోవటం ఆనవాయితీగా వస్తుందని జూబ్లీహిల్స్ శాసనసభ్యులు బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ అన్నారు. మంగళవారం బోరబండ సైట్3లోని ప్రొఫెసర్ జయశంకర్ ఫంక్షన్ హాల్లో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అన్ని మతాలను గౌరవిస్తూ పండుగ పర్వదినాలను శాంతియుతంగా జరుపుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ సిరాజ్, కోఆర్డినేటర్ విజయ్‌సింహా, ఫయాజ్‌ఖాన్, యూసుఫ్, ధర్మ, బాబురావు, దేవమణి తదితరులు పాల్గొన్నారు.

### సమాజ సేవలో ప్రతి ఒక్కరు ముందు ఉండాలి : మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : సమాజ సేవలో ప్రతి ఒక్కరు ముందుండాలని రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మన స్నేహం ఎన్ ఎన్ ఫ్రెండ్స్ గ్రూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి సౌజన్యంతో కీర్తి అవార్డ్స్ అందజేయనున్నట్లు తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మంత్రి మల్లారెడ్డి నివాసంలో అవార్డ్స్ బ్రోచర్‌ను మంత్రి మల్లారెడ్డి జవహర్‌నగర్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, టిఎల్ఎఫ్ ప్రెసిడెంట్ కోఆప్షన్ సబ్యురాలు శోభరెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక సేవా రంగాలలో ఉత్తమ సేవలను అందిం చిన వారిని గుర్తించి అవార్డును అందించడం జరుగు తుందన్నారు.

# ఒయులోని మెట్లబావిని సందర్శించిన ప్రొఫెసర్లు



ఒయు మెట్లబావిని పరిశీలిస్తున్న అనురాధారెడ్డి, ఒయు ప్రొఫెసర్లు సత్యనారాయణ బృందం

తార్నాక, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: వరల్డ్ హెరిటేజ్ డే ను పురస్కరించుకొని మంగళవారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆవరణలో ఉన్న చారిత్రాత్మక మెట్లబావిని ఇంటాక్ ప్రతినిధి అనురాధా రెడ్డి, ఓ.యూ ప్రొఫెసర్లు సందర్శించారు. ఇటీవల మెట్లబావి పునరుద్ధరణ పనులను ప్రారంభించిన నేపద్యంలో ఇంటాక్ బృందం ఓ.యూ అధికారులతో కలసి ఈ బావిని పరిశీలించారు. ఈ సందర్భంగా అనురాధా రెడ్డి, విద్యాశాఖ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ సత్యనారాయణ, యూసీఈ ప్రిన్సిపల్ ప్రొ.రవీంద్రనాథ్ మూర్తి, డా. శంకర్, ప్రొ.ప్యాట్రిక్, ప్రొ.సిహెచ్ శ్రీనివాస్, ఈఎంఆర్‌సీ డైరెక్టర్ ప్రొ.మృణాలినితో పాటు ఇంటాక్ సభ్యులు, విద్యార్థులు మెట్ల బాలో కలియతిరిగారు. ఈ సందర్భంగా అనురాధా రెడ్డి మెట్లబావి చరిత్రను, మహలకబాయి తెలంగాణలో స్త్రీ విద్యకోసం ఆమె చేసిన కృషిని స్మరించుకున్నారు. నగరాన్ని హెరిటేజ్ సిటీగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అనురాధారెడ్డి పేర్కొన్నారు. మెట్లబావిని పునరుద్ధరించి సందర్శకులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. బావులను పరిరక్షించి నీటీ వనరులను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## రసరమ్యం నవరసభరితం శ్రీనాథుడు పద్యనాటకం



శ్రీనాథుడు పద్యనాటకంలోని దృశ్యాలు

రవీంద్రభారతి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : . తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో గుమ్మడి గోపాలకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని 3రోజుల పాటు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రతీరోజూ రాత్రి 6.15గంటల నుండి పద్యనాటకోత్సవాలు వైభవంగా జరుగుతున్న విషయం మా పాఠకులకు విదితమే. ఈనాటి రెండవరోజు కార్యక్రమంలో జిజికె ఫౌండేషన్ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ నాటకరంగాన్ని అత్యాధుని డిజిటల్ టెక్నాలజీని జోడించి విశ్వవ్యాప్తంచేసి తెలుగుజాతి ఔనత్యాన్ని చాటడంలోపాటు ఉభయ తెలుగురాష్ట్రాల్లోని వృద్ధ రంగస్థల కళాకారులను ఆర్థికంగా ఆదుకోవడం, నాటకాల కోసం ప్రత్యేకంగా ఒక కోర్సు రూపకల్పన చేయడం, ఔత్సాహిక యువనటులకు శిక్షణిచ్చి ఉత్తమ కళాకారులుగా తీర్చిదిద్దడం, ప్రోత్సాహమివ్వడం, నాటకాలు, పద్యాలు, కళలను భావితరాలకు అందించడం ధ్యేయంగా సాగుతున్నామని వివరించారు. పద్యనాటకోత్సవం మూడవ ఆఖరిరోజు డా. డి.విజయభాస్కర్ రచన, గుమ్మడి గోపాలకృష్ణ పద్యరచన దర్శకత్వంతో ప్రధానపాత్ర వేమనగా గుమ్మడి గోపాలకృష్ణ నటించిన యోగివేమన పద్యనాటకం ప్రదర్శింపబడుతుందని నిర్వాహకులు తెలిపారు. చివరిగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత ఐపిఎస్ అధికారి సి.ఆంజనేయరెడ్డి విశిష్ట అతిథులు పద్మభూషణ్ కె.పద్మనాభయ్య, అశ్విని సుబ్బారావు, దొర తదితరులతో కలిసి శ్రీనాథుడు పద్యనాటకంలోని కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు.

## విద్యాసంస్థల వెబ్‌సైట్‌లపై జరిగే సైబర్ దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పోటీ పరీక్షల నిపుణురాలు బాలలత

హైదరాబాద్, ఏప్రిల్ 18,ప్రభాతవార్త: విద్యాసంస్థల వెబ్‌సైట్లపై జరిగే సైబర్ దాడులపై విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సిఎస్‌బి ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్, పోటీ పరీక్షల నిపుణురాలు బాలలత సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఉచితంగా సేవలందిస్తున్న బాలలత మేడమ్ యూట్యూబ్ వెబ్‌సైట్‌ను హ్యాక్‌చేయడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సర్వీస్ సేవలు, విద్యాబోధనకు సంబంధించిన కార్యకలాపాలు అడ్డుకునే ఉద్దేశ్యంతోనే తమసంస్థ వెబ్‌సైట్, ఈమెయిల్స్,యూట్యూబ్ ఛానెల్‌పై సైబర్ దాడి చేశారని మండిపడ్డారు. ఇది తనపై జరిగిన దాడి కాదని.. తెలంగాణ పేద విద్యార్థులపై జరిగిన కుట్ర అని అన్నారు. యూట్యూబ్ ఛానెల్‌ను హైజాక్ చేయడం వల్ల గ్రామీణ పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈమధ్యకాలంలో ఎక్కువమంది తెలుగు విద్యార్థులు సివిల్ సర్వీసెస్‌లో ఎంపిక కావడంతో కొందరు ఈపనిచేసి ఉంటారని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి గ్రామానికి వెళ్ళి ..పేద విద్యార్థులకు సైతం పోటీ పరీక్షలుకు సన్నద్దులను చేయాలనే ఉద్దేశ్యంతో యూట్యూబ్ ఛానల్ ద్వారా ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశామని విద్యార్థులు నష్టపోకుండా బాలలత అఫీషియల్ అనే కొత్త యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. పోటీ పరీక్షల సమయంలో విద్యాసంస్థలకు చెందిన యూట్యూబ్‌ను హ్యాక్ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌కు సన్మానం



రవీంద్రభారతి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : తెలంగాణ ఉద్యమ గొంతుక ప్రముఖ రచయిత, తెలంగాణ శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ అని తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో మంగళవారం రాత్రి జరిగిన దేశపతి శ్రీనివాస్ అభినందన సభలో తెలంగాణ రచయితలు, సాహితీవేత్తలు శ్లాఘించారు. డా. నాళేశ్వరం శంకరం సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత రచయితలు కె.శివారెడ్డి, నందిని సిధారెడ్డి, మామిడి హరికృష్ణ, నలిమెల భాస్కర్, వారాల ఆనంద్, దేవిప్రసాదరావు, విరాహత్ అలీ, గంగ్ర లక్ష్మణ రావు, దాస్యం సేనాధిపతి, కందుకూరి శ్రీరాములు, పొట్లపల్లి శ్రీనివాస రావు, వి.శంకర్, ఘనపురం దేవేందర్, బెల్లంకొండ సంపత్‌కుమార్ పాల్గొని దేశపతి శ్రీనివాస్‌కు ఘనంగా అభినందన సత్కారం కావించి ప్రసంగించారు. నాళేశ్వరంశంకరం అధ్యక్షోపన్యాసంలో తెలంగాణలోని ప్రతిఇంటినీ సాహిత్యపరిమణంలో నింపిన గొప్ప సాహిత్య, ఉద్యమకారుడు దేశపతి శ్రీనివాస్ అన్నారు. శివారెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని ఎలుగెత్తి చాటుకున్న గొప్ప ఉద్యమకారుడు, స్ఫూర్తిప్రదాత, చైతన్యవంతుడు, రాబోయేతరాలకు ప్రోత్సాహకం దేశపతి అని, తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో చైతన్యపరిచి ఉద్రూతలూగించారన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
GHMC

నిట్ నెం.02/SE/KPZ/GHMC/2023-24, తేది: 17.04.2023
పని పేరు: 2023-24 సంవత్సరానికి గాను KPZ, GHMC యందు నాలా సేఫ్టీ ఆడిట్‌ను నిర్వహించేందుకు గాను కన్సల్టెన్సీ సేవలు, బిడ్‌ల స్వీకరణకు ప్రారంభ తేది / చివరి తేది మరియు సమయం: 18.04.2023న ఉ.11.00 గం.లు, 25.04.2023న ఉ.11.00 గం.లు. అధికారి పేరు, చిరునామా మరియు సెల్ నెం: SE/KPZ, GHMC, 9989930363.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీరు, కూకట్‌పల్లి జోన్, GHMC
DIPR.No.520-PP/CL/Advt/1/2023-24, తేది: 18.04.2023

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

ప.నెం.1, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన నిట్ నెం.04/SE(KZ)/GHMC/TA/2023-24, తేది: 17.04.2023, పనుల సంఖ్య: SW డ్రెయిన్-I, మొత్తం విలువ: రూ.77.00 లక్షలు, బిడ్‌ల స్వీకరణకు ప్రారంభ తేది: 18.04.2023న మ.3.00 గం.లు, బిడ్‌ల స్వీకరణకు చివరి తేది: 25.04.2023న మ.3.00 గం.లు. అధికారి పేరు, మరియు సెల్ నెం: SE (KZ), GHMC, ఫోన్ నెం.8790522144. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.eprocurement.gov.in పై చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీరు (KZ) హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
DIPR.No.539-PP/CL/Advt/1/2023-24, తేది: 18.04.2023

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
మల్కాజ్‌గిరి సర్కిల్-28
GHMC

నిట్ నెం.05/EE-28/SBZ/GHMC/2023-24, పని పేరు: నిర్వహణ పనులు, ఇతరములు-6, అంచనా విలువ (రూ.లక్షలలో): 118.90, బిడ్ దాఖలుకు ప్రారంభ తేది మరియు సమయం: 18.04.2023న సా.4.00 గం.లు, బిడ్ దాఖలుకు ముగింపు తేది మరియు సమయం: 25.04.2023న సా.4.00 గం.లు. అధికారి పేరు, చిరునామా మరియు సెల్ నెం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, 9154796465. తదుపరి వివరములకు @http://www.tender.telangana.gov.in ను చూడగలరు. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డివిజన్-28, GHMC
DIPR.No.531-PP/CL/Advt/1/2023-24, తేది: 18.04.2023




మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసిన బాబు జగ్జీవన్‌రావు ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు కొమ్ముల నరేందర్


వార్త VAARTHA CLASSIFIEDS — CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, AGNISHTOMA PULIGADDA, S/o. SRINIVASA CHAKRAVARTHY PULIGADDA, R/o. SR-162-A, Seetharamnagar, Ramakrishnapuram, Secunderabad, Medchal Malkajgiri District, Telangana, Changed by Name as ANANTHA PADMANABHA PULIGADDA for all Purpose.
(Ro.No.063461)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


## శివరామాంజనేయ దేవాలయ విగ్రహా ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవానికి ఏర్పాట్లు



కబీర్‌నగర్‌లో శ్రీశ్రీశ్రీ శివరామాంజనేయ దేవాలయ పునర్‌నిర్మాణం విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : శ్రీ శివరామాంజనేయ దేవాలయ విగ్రహా ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవం కబీర్‌నగర్, మోతీనగర్ ఎక్స్‌టెన్షన్‌లో మే నెల 10 తేదీ నుంచి అంగరంగా వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ వెల్లడించారు. ఇందుకు గాను మంగళవారం ఆలయ ప్రాంగణంలో ప్రారంభోత్సవానికి సంబందించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన హనుమాను ఆలయం శిథిలావస్తకు చేరటంతో 2016లో పునర్‌నిర్మాణం పనులు చేపట్టారు. నిధుల కొరతతో ఆలయ నిర్మాణంలో జాప్యం జరిగినప్పటికి ఎట్టకేలకు ఆలయ నిర్మాణాన్ని అతి సుందరంగా పూర్తి చేయటం జరిగిందన్నారు. మే నెల 10 నుంచి 14వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమం శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం పీఠాదీశ్వరులు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం సేకరించిన విరాళాలు దుర్వినియోగం చేశారని ఇటీవల ఓ వ్యక్తి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తమని, ఆలయ నిర్మాణం కోసం కర్చుచేసిన ప్రతి రూపాయికి సంబంధించిన వివరాలు బహిర్గతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ సభ్యులు మహేష్ యాదవ్, రమేష్, అయ్యంగార్, గోపిశెట్టి రాఘవేందర్, వీరాస్వామి, శ్రీనివాస్‌గుప్త, కె.ఆనంద్‌రెడ్డి, దుర్గారామ్, శ్రీధర్ చాణుక్య, నర్సింగ్‌రావు, రంగప్ప పాల్గొన్నారు.


IN THE COURT OF THE HON'BLE, IInd SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD
O. S. No: 1209 of 2019
Between:
**State Bank of India,** RACPC-III, Hyderabad - 500029.
...Plaintiff
AND
**Mrs. Susmitha Swapna Kumari,** aged major, Occ: R/o. Plot No.10, Saikrupa Enclave, Nethaji Nagar, Nagaram, Hyderabad-500083.
...Defendant
**NOTICE**
Take notice that the plaintiff bank filed the above suit for recovery of amount against the defendant and the said suit is stands posted for your appearance on **27.04.2023.** Hence your are hereby directed to appear before the said court on 27.04.2023 at 10.30 AM personally or through an advocate failing which the matter will be heard in your absence.
//By order of the Court//
**B. SRIRAM KARTIK, S KISHORE,**
**Advocates,**
Plot No.22, Sri Sai Nagar Colony, Road No.4, GSI Post, Hyderabad-500068.

IN THE COURT OF THE HON'BLE, IInd SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD
O. S. No: 1207 of 2019
Between:
**State Bank of India,** RACPC-III, Hyderabad-500029.
...Plaintiff
AND
**Mrs. Ishi Chabra,** aged major, Occ: R/o. H.No.13, Nolagiri Homes, Rampally, Hyderabad - 501301. ...Defendant
**NOTICE**
Take notice that the plaintiff bank filed the above suit for recovery of amount against the defendant and the said suit is stands posted for your appearance on **27.04.2023.** Hence your are hereby directed to appear before the said court on 27.04.2023 at 10.30 AM personally or through an advocate failing which the matter will be heard in your absence.
//By order of the Court//
**B. SRIRAM KARTIK, S KISHORE,**
**Advocates,**
Plot No.22, Sri Sai Nagar Colony, Road No.4, GSI Post, Hyderabad-500068.

**బహిరంగ ప్రకటన**
ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు కొల్లూరు (గ్రా.), నవాబుపేట (మం.), మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రంలో గల ఎ.0.20 గుం.ల విస్తీర్ణము గల వ్యవసాయ భూమిని దాని యొక్క వాస్తవ పట్టాదారు మరియు ORC హోల్డరు అయిన శ్రీమతి సభావత్ ఉమ్లా, శ్రీ గొల్ల రాములు నుండి కొనుగోలు చేసిన శ్రీ జి. సుధాకర్, తండ్రి శ్రీ జి. నాగప్ప నుండి సరియగు అమ్మకపు మొత్తాన్ని చెల్లించి కొనుగోలు చేసేందుకు ఆసక్తి కలిగియున్నారు. పైన తెలిపిన ఆస్తి యందు ఏదేని వ్యక్తికి (వ్యక్తులకు) ఎటువంటి హక్కు, టైటిలు లేదా ఆసక్తి ఉన్న యెడల వారు తమ అభ్యంతరాలను ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 7 రోజులలోపుగా తెలుపుకొనవలెను. లేని పక్షంలో ఇట్టి లావాదేవీ మా క్లయింటు ద్వారా పూర్తి చేయబడుతుంది. ఒకవేళ ఏదేని అభ్యంతరాలు అటు మీదట స్వీకరింపబడినవి చెల్లుబాటు కానివిగా పరిగణింపబడతాయి.
**అక్షత్ సంఘి & ప్రణీత సంఘి**
**న్యాయవాదులు**
ఫ్లాట్ నెం.302, వంశ్ టవర్స్, 3వ అంతస్తు, మహేష్‌నగర్ కాలనీ, చిరాగ్ అలీ లేన్, హైదరాబాద్-500001,
సెల్ నెం.09963102934
E-mail: akshatsanghi@gmail.com

IN THE COURT OF THE HON'BLE III JUNIOR CIVIL JUDGE,CITY CIVIL COURT:: HYDERABAD AT: HYDERABAD
O.S.No. 1327 OF 2020
BETWEEN:
State Bank of India Retail Assets Central Processing Centre (RACPC) - V, Gunfoundry Branch, At: Abids, Hyderabad. Rep. by its Authorised Officer,
... PLAINTIFF
AND
1) Sri. Kothakota Vasubabu, S/o. Kothakota Gopala Rao, & 2 Others
... DEFENDENTS
To
1) Sri. Kothakota Vasubabu, S/o. Kothakota Gopala Rao, Age about Major , Occ: Police Constable -3223, Employee Code: 2586194, O/o. Director General TSSPF HQr's 4th Floor, Budha Bhavan, Ranigunj, Secunderabad - 500 024. &R/o. H.No.1-12-C, Boyinavari Palem, Ipuru palem Rural, Chirala (M), Prakasam (Dist), Andhrapradesh – 523166. & R/o. H.No.19-201, Epurupalem Rural, Chirala (M), Prakasam District, Andhrapradesh – 523 166.
Take notice that the above-named plaintiff have instituted the above suit against you for recovery of outstanding amount of **Rs.2,66,249.24/-** (Rupees Two Lakhs Sixty Six Thousand Two Hundred Forty Nine Paise Twenty Four Only) along with interest from the date of suit till the realization together with subsequent interest. You are hereby directed to appear before the Hon'ble Third Junior Civil Judge, City Civil Court Hyderabad at Hyderabad in person or through your counsel on **27.04.2023, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence as per law.
//By order of the Court//
**K.JAYARAJ**
ADVOCATE

# యావత్ దేశం హైదరాబాద్ వైపు చూసే విధంగా సిఎం కెసిఆర్ అభివృద్ధి : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నాలుగు లేన్ల రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబిత ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** దేశం మొత్తం హైదరాబాద్ వైపు చూసే విధంగా ముఖ్యమంత్రి కెసిఆర్ అభివృద్ధి చేయిస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబిత ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మామిడిపల్లి గ్రామం నుండి శంషాబాద్ వరకు రూ.29.50 కోట్లతో చేపట్టిన నాలుగు రోడ్ల రహదారి విస్తరణ అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అభివృద్ధిపరంగా హైదరాబాద్ రూపురేఖలనే మార్చడానికి బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని వెల్లడించారు. ముఖ్యంగా శివార్లలోని ఔటర్‌రింగ్‌రోడ్డులోపల ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించిందని ఆమె వివరించారు. ఇతర జిల్లాల నుండి హైదరాబాద్‌లోకి వచ్చే వారికి రహదారులపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నదని పేర్కొన్నారు. అదే విధంగా నగరం నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో రైల్‌ను విస్తరించాలనే ఉద్దేశ్యంతో ఉన్న సిఎం కెసిఆర్ అందుకు అనుగుణంగా శివారు ప్రాంతాలను అభివృద్ధి చేయిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌ను మోడల్ సిటీగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో నాలుగు రోడ్ల రహదారుల నిర్మాణంతో పాటు ఇంకా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ అభివృద్ధి పనులు జరుగుతున్నందుకు హర్షం వ్యక్తం చేసిన సబితారెడ్డి సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, జిఎంఆర్ ఎయిర్ పోర్టుకు చెందిన పలువురు ప్రతినిధులు, స్థానిక మామిడిపల్లి కార్పొరేటర్లు యాతం పవన్‌కుమార్ యాదవ్, సుక్క శివకుమార్, మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు నిమ్మల నరేందర్‌గౌడ్, స్థానిక నాయకులు బండారి గోపాల్ యాదవ్, యాతం బాలరాజ్ యాదవ్, సురేష్‌గౌడ్, అశోక్ ముదిరాజ్‌లతో పాటు రామిడి రాంరెడ్డి, పెద్దబావి ఆనంద్‌రెడ్డి, సంరెడ్డి వెంకట్‌రెడ్డి బోయపల్లి శేఖర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సమాజ సేవలో ప్రతి ఒక్కరు ముందు ఉండాలి : మంత్రి చామకూర మల్లారెడ్డి

**జవహర్‌నగర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** సమాజ సేవలో ప్రతి ఒక్కరు ముందుండాలని రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మన స్నేహం ఎన్ఎన్ ఫ్రెండ్స్ గ్రూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి సౌజన్యంతో కీర్తి అవార్డ్స్ అందజేయనున్నట్లు తెలంగాణ వికలాంగుల హక్కుల సాధనసమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మంత్రి మల్లారెడ్డి నివాసంలో అవార్డ్స్ బ్రోచర్‌ను మంత్రి మల్లారెడ్డి జవహర్‌నగర్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, టిఎల్ఎఫ్ ప్రెసిడెంట్ కోఆప్షన్ సభ్యురాలు శోభరెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక సేవా రంగాలలో ఉత్తమ సేవలను అందించిన వారిని గుర్తించి అవార్డును అందించడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 16న రవీంద్రభారతిలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కుతాడి సాయికుమార్, మన స్నేహం, ఎన్ఎన్ ఫ్రెండ్స్ గ్రూప్ అధినేత కావేరి ధర్మేందర్, వికలాంగుల హక్కుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మెరుగు శివకృష్ణ, భువనగిరి జిల్లా అధ్యక్షుడు కనకబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ముస్లీం సోదరుల సత్కారం



ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** కొత్తపేట డివిజన్లో ముస్లిం సోదరులు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగరపు దయానంద్, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, కొత్తపేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లింగల రాహుల్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ గౌడ్, ఉదయ గౌడ్, కిషోర్ గౌడ్, రామేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

## డాక్టర్స్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలి

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీలో సమస్యలు పరిష్కరించేవిధంగా చర్యలుచేపట్టాలని ఏఈ సరితకు డాక్టర్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. కాలనీలో రోడ్లు డ్రైనేజీ తదితర సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక సమస్యల గురించి మంత్రి సబితకు కూడా వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

## త్వరలోనే సమస్యల పరిష్కారం : కార్పొరేటర్

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** చైతన్యపురి డివిజన్ మున్సిపల్ కాలనీ గణేష్ పురి కాలనీలో కార్పొరేటర్ రంగా నర్సింహాగుప్తా ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి ఇంటెన్సివ్ శానిటేషన్, ఆర్డబ్ల్యూఏ ఇంట్రాక్షన్ ప్రోగ్రాం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో పలు సమస్యలను గురించి చర్చించారు. ఆయా సమస్యలను 100 రోజులలో పరిష్కరించే విధంగా అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవీందర్ రెడ్డి, పార్వతి, మహేందర్ రెడ్డి, కాలనీవాసులు కృష్ణగౌడ్, యాదయ్య, జై హింద్, రాజి రెడ్డి, రమేష్ యాదవ్, బీజేపీ నాయకులు పసుపుల హరిబాబు, రామ్మోహన్ ఉదయ్, అర్జున్, భాను పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమంకోసం సిఎం కెసిఆర్ కృషి : హయత్ హుస్సేన్ హబీబ్



రంజాన్ కానుకలను అందజేస్తున్న హయత్ హుస్సేన్ హబీబ్, లాయఖ్ అలీ

**మలక్‌పేట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** రాష్ట్రముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని వర్గాల సంక్షేమంకోసం ఎంతో కృషి చేస్తున్నారని బిఆర్ఎస్ చావుని డివిజన్ అధ్యక్షుడు హయ్యత్ హుస్సేన్ హబీబ్ పేర్కొన్నారు. మలక్‌పేట నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంఛార్జి ఆజం అలీ పర్యవేక్షణలో చావుని డివిజన్ ప్రాంతవాసులకు ఆయన ఆధ్వర్యంలో రంజాన్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కెసిఆర్ అందరి పండుగలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ కానుకలను అందజేస్తున్నారని కొనియాడారు. సిఎం కెసిఆర్ సారధ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రాధన్యతను ఇస్తుందని తెలిపారు. ముఖ్యంగా మైనార్టీలకు రంజాన్ మాసంలో రంజాన్ కానుకలను అందజేస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రజలు సోదర భావంతో కలిసి మెలసి జీవించాలన్నారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. పండుగలు మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. చావుని డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ముమ్మరంగా రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారికి అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లాయఖ్ అలీ, మహమూద్‌ఖాన్, సల్మాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎస్ సదన్ డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి: కార్పొరేటర్ శ్వేత



వివిధ విభాగాల అధికారులతో కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డి మంగళవారం సింగరేణి ఆఫీసర్స్ కాలనీ పార్కులో వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాలతో సమావేశం నిర్వహించారు. డిసి నర్సింహా, డిపిఒ రత్నమ్మ, ఎఇ అన్సారీతో పాటు పోలీసు, ఎంటమాలజి, వాటర్‌వర్క్స్, హార్టికల్చర్ తదితర విభాగాలకు చెందిన అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ వర్షం పడినప్పుడు రోడ్లపై నీరు నిలబడకుండా చర్యలు చేపట్టాలని, డ్రైనేజీల్లో పూడికతీత చేపట్టాలని,ఎస్ఎన్‌డిపి పనులు వేగవంతం చేయాలని సూచించారు. డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు కెఆర్‌సి రెడ్డి, సర్వేశ్వర్ రావు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. కార్పొరేటర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖతోపాటు వివిధశాఖల అధికారులు, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాంతీయ గ్రూపులు, రీజినల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలసి డివిజన్‌లోని ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లో పర్యటించి సమస్యలపై పరస్పర చర్చా కార్యక్రమాన్ని నిర్వహించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన రోడ్లు చేపట్టాలని, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని, చెట్ల కొమ్మలను ట్రిమ్మింగ్ చేయాలని, రోడ్డుపై వ్యర్థాలు, మట్టిదిబ్బలు తొలగించాలని తదితర సమస్యల గురించి స్థానికులు కార్పొరేటర్ భాగ్యలక్ష్మి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆమె స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. డివిజన్‌లోని అన్ని సమస్యలను పరిష్కరించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి బన్సీలాల్, అధికారులు చంద్రునాయక్, ఎస్ఐ శృతిరెడ్డి, గున్నప్ప, సూపర్ వైజర్లు ముజీబ్, శ్రీను, రవి, దూళ్లరావు, కాలనీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు : నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి




లబ్దిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

**తార్నాక, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** తార్నాక డివిజన్ చింతల్ బస్తీ ప్రాంతంలో గల రేషన్ షాప్‌ల్లో మంగళవారం డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ద్వార అందజేస్తున్న బియ్యం సరఫరా అవుతుందా, సమయానికి షాప్‌లను ఒపెన్ చేస్తారా అని కార్డు దారులకు వారు అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారులకు అందేలా చూడాలని వారు ఆదేశించారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే ప్రభుత్వం ద్వారచర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో సరస్వతి, సర్కిల్ 9 ఇన్స్‌పెక్టర్లు లోకేష్, ఉత్తేజ్, కిరణ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉచితంగా పాలిటెక్నిక్ కోచింగ్

**మలక్‌పేట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** ఆర్థికంగా వెనుకబడిన అన్ని వర్గాల విద్యార్థులకు ఉచితంగా పాలిటెక్నిక్ కోచింగ్ ఇస్తున్నట్లు వాణి అకాడమి డైరెక్టర్ శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 19వ తేదీలోపు దిల్‌సుక్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో లేదా 9550170234, 9963143867లలో సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## గౌతమ్‌నగర్‌లో రూ. 20 లక్షలతో సిసి రోడ్డు పనులు : కార్పొరేటర్ సునీత

**మల్కాజిగిరి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు ఆదేశాలతో గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఉత్తమ్‌నగర్‌లో కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ 20 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాముయాదవ్, వర్క్ ఇన్స్‌పెక్టర్ నరేందర్, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## యాప్రాల్, రిజిస్ట్రేషన్ కాలనీలో భారీ మెడికల్ షెడ్డు - పక్కనే బహుళ అంతస్థుల నిర్మాణం

### మరో అగ్నిప్రమాదం అంచుల్లో కాలనీ వాసులు పట్టించుకోని సంబంధిత అధికారులు..

**నేరెడ్‌మెట్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని నేరెడ్‌మెట్ డివిజన్ యాప్రాల్ రిజిస్ట్రేషన్ కాలనీలో భారీ మెడికల్ షెడ్డును ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా దాని పక్కనే ఓ బహుళ అంతస్థును నిర్మిస్తున్నారు. మరోవైపు కోట్ల వ్యయంతో చేపట్టిన అధునాతన మైన విల్లాస్. ఇటీవల కుషాయిగూడ ప్రాంతలో ఓ టింబర్ డిపోలో అగ్నిప్రమాదం జరిగి ఓ కుటుంబ ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. భారీ షెడ్లు, ఎత్తైన భవనాలు, కోట్ల వ్యయంతో చేపడుతున్న నిర్మాణాలకు సంబంధిత అధికారులు ఇష్టానుసారంగా, నిబంధనలను తుంగలో తొక్కుతూ అనుమతులు ఇస్తూ ప్రజల ప్రాణాలకు గురి పెడుతున్నారని పలు ప్రజా సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఇండ్ల మధ్యలో ఏర్పాటు చేసిన భారీ షెడ్లు, వ్యాపారాల షెడ్లను తొలగించాలని పలు సంఘాల నాయకులు కోరుతున్నారు.

## ఆర్‌బిఐ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పవన్ కుమార్

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** కొత్తపేట డివిజన్ న్యూ ఆర్బిఐ కాలనీలో ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడి కాలనీకి ఉపయోగపడే విధంగా చేయాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్‌ని కోరారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ ఆర్బిఐ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులను సంప్రదించి ప్రభుత్వ స్థలాన్ని కబ్జాలకు గురికాకుండా కాపాడాలని చూసుకునే బాధ్యత నాదన్నారు. డివిజన్ లో వెంటనే ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో వాటిని గుర్తించి చుట్టూ కంచెలు వేయించి ప్రజలకు ఉపయోగపడేలా పార్కులు, ఓపెన్ జిమ్ములు, లైబ్రరీ, సీనియర్ సిటిజన్ భవనాలు ఏర్పాటు చేయించాలని ఆయన అధికారులను కోరారు.

## హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** చైతన్యపురి డివిజన్ మునిసిపల్ కాలనీ సిఐటియు కార్యాలయంలో హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ లేబర్ కమిషన్ ఆఫీస్ ధర్నాను జయప్రదం చేయాలని మంగళవారం వాల్ పోస్టర్లు విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా హమాలి అధ్యక్షులు పల్లెపాక వీరయ్య మాట్లాడుతూ హమాలీలకు భవన నిర్మాణ కార్మికుల వలె వెల్ఫేర్ ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలనీ, 50 కిలోలకు మించిన బరువులు నిషేధించాలని, పని గంటలు పని భద్రత గుర్తింపు కార్డులో కనీస వేతనాలు పెన్షన్ 20 చట్టబద్ధం హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాస్, ఎం. దూలప్ప, జి.బిచ్చమ్మ, జి.రాజు, లింగయ్య, శ్రీను, సాయిలు, బసవయ్య పాల్గొన్నారు.

## సబితారెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా: రాఘవేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పలువురు యువజన కాంగ్రెస్ నాయకులతో సమావేశమైన ఆయన మంత్రిపై తాను ఆవేశంతో అనుచితంగా మాట్లాడానని అన్నారు. అంతే తప్ప తాను ఉద్దేశ్యపూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. మంత్రిపై తాను చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు.

## ప్రజల్లోకి వెళ్ళి పార్టీని పటిష్టం చేయాలి: అందెల

**సరూర్‌నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లోకి వెళ్ళి క్షేత్ర స్థాయి నుండి బిజెపి పటిష్టతే లక్ష్యంగా పని చేయాలని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, శక్తి కేంద్రం ఇంఛార్జి నిమ్మల రవికాంత్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వశక్తికరణ అభియాన్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బూత్ స్థాయిలో ఓటర్ల జాబితా, వాట్సాప్ గ్రూపులు తదితర అంశాలపై సమీక్ష జరిపిన ఆయన పార్టీ శ్రేణులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలకు పార్టీ క్యాడర్ సిద్ధమై పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మర్రి అంజిరెడ్డి, తిరుపతి మహేందర్, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, తిరుపతి సంతోష్, పాలుబాయి శ్రీనివాస్, యెల్చల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో గాయపడిన కోతికి మాతృదేవోభవ చికిత్స

**సరూర్‌నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** కుక్కల దాడిలో గాయపడిన కోతిని కాపాడి వైద్య చికిత్సలను అందించింది నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ ఆశ్రమం. మతిస్థిమితంలేని అభాగ్యులను ఆదరిస్తున్న ఆశ్రయ వ్యవస్థాపకుడు గట్టు గిరి నాదర్‌గుల్‌లోని ఆశ్రమ సమీపంలో శునకాల దాడిలో తీవ్రంగా గాయపడి కొట్టుమిట్లాడుతున్నకోతిని గమనించి నారాయణగూడలోని వెటర్నరీ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. బుధవారం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి వానరాన్ని అప్పగిస్తామని ఆయన తెలిపారు.

## మల్కాజిగిరి జిల్లా కోర్టు అవరణలో కంటివెలుగు



కంటి వెలుగు శిబిరంలో సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి, వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్

**నేరెడ్‌మెట్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు పథకాన్ని మంగళవారం మల్కాజిగిరి కోర్టు అవరణలో సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి, జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు పథకం తెలంగాణ రాష్ట్రంలో విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కంటివెలుగు పథకానికి సైతం ప్రజల్లో మంచి స్పందన లభిస్తుందన్నారు. కంటి వెలుగు పథకంలో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులకు సుమరు 157 మంది పరీక్షలు నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కవిత, పిహెచ్‌సి అధికారి యేల్‌కపూర్, జ్యోతి, ఈశ్వర్, ప్రాథమిక అరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సబితారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాఘవేందర్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి: ముద్దా



రాఘవేందర్‌రెడ్డిని హెచ్చరిస్తున్న ముద్దా పవన్‌కుమార్

**సరూర్‌నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి, ఇక్కడి ప్రజల సంక్షేమానికి అహర్నిషలు పని చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పి.సబిత ఇంద్రారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలనీ లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని నియోజకవర్గ బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు, మీర్‌పేట్ కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బోయపల్లి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ప్రజల కోసం అహోరాత్రులు పని చేస్తున్న సబితమ్మను మరోసారి విమర్శిస్తే నాలుక కోస్తామనీ క్షమాపణలు చెప్పకుంటే దుస్తులు ఊడదీసి ఉరికించి కొట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. తనకు జైలు ఏమీ కొత్త కాదనీ 24 గంటల లోపు బహిరంగ క్షమాపణలు చెప్పకుంటే తన కార్యకర్తలే చూసుకుంటారని ఆయన స్పష్టం చేశారు.

**రాఘవేందర్‌రెడ్డి తాట తీస్తాం: కార్పొరేటర్ సౌందర్య విజయ్**

మహిళ అని చూడకుండా సాక్షాత్తు మంత్రి సబితా ఇంద్రారెడ్డిపైనే వ్యక్తిగత అనుచిత వ్యాఖ్యలు చేసిన రాఘవేందర్‌రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పకుంటే తాట తీస్తామని మీర్‌పేట్ కార్పొరేషన్ 35వ డివిజన్ కార్పొరేటర్ సౌందర్య విజయ్ హెచ్చరించారు. బోయపల్లి వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించి న ఆమె రాఘవేందర్‌రెడ్డిని తూర్పారబట్టారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం : కార్పొరేటర్ కొప్పుల

**హయత్‌నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మహానగరంలో సూర్యుడు ఉదయించక ముందే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అహర్నిషలు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు అభినందనీయులని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, ఎస్సీ మోర్చ రంగారెడ్డిఅర్బన్‌జిల్లా అధ్యక్షుడు బాణాల ప్రవీణ్‌కుమార్ అన్నారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఎస్సీ మోర్చా హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు పారందసాయి ఆధ్వర్యంలో బొమ్మలగుడి చౌరస్తా వద్ద పారిశుద్ధ్య కార్మికులకు శాలువాలు కప్పి సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరి ఇళ్లల్లో వారు చెత్తను తొలగించుకోవడానికి సిగ్గుపడే పరిస్థితుల్లో పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి చెత్త, చెదారాలతో పాటు వ్యర్థాలను తొలగించి రహదారులను శుభ్రంగా ఉంచుతున్నారని తెలిపారు. వారిని గౌరవించుకోవడంతో పాటు తోచిన విధంగా సహకారం అందిస్తూ వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది నరేష్, వెంకటేష్, బిక్షపతి, అందాలు, శమంత్, ఎస్సీ మోర్చా ప్రతినిధులు కిరణ్‌కుమార్, రామేశ్వర్ పాల్గొన్నారు.

## గాయత్రీనగర్ ఫేజ్-4 కాలనీలోని పార్కు స్థలాన్ని పరిశీలించిన అధికారులు



కాలనీవాసులతో కలిసి పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**వనస్థలిపురం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** పార్కు స్థలాలను కబ్జాకు గురి కాకుండా కాపాడాల్సిన బాధ్యత కాలనీవాసులపై ఉందని హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతీదివాకర్ పేర్కొన్నారు. బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాయత్రీనగర్ ఫేజ్-4 కాలనీలోని పార్కు స్థలాన్ని మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారులు సంక్షేమ సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గాయత్రీనగర్ ఫేజ్-4కాలనీలో లే అవుట్ పార్కు అభివృద్ధికోసం కేటాయించిన 1600 గజాల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్కు స్థలానికి పెన్సింగ్ వేయడానికి ప్రణాళిక సిద్ధం చేసామన్నారు. పార్కు స్థలాల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. పార్కు స్థలానికి సంబంధించిన లే అవుట్, తదితర పత్రాలను అందజేస్తే త్వరలో పార్కు ప్రహరీ నిర్మాణపు పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ బిఆర్ఎస్ ఇంఛార్జి కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, పోగుల రాంబాబు, టిపిఎస్ ఉమాదేవి, కాలనీ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పనితీరు మెరుగుపరుచుకోకుంటే చర్యలు తప్పవు: కార్పొరేటర్ కళ్లెం

**హయత్‌నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** బీడీఎల్ కాలనీలో పారిశుద్ధ్య లోపాలు ఎక్కువగా ఉన్నాయని... శానిటేషన్ సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోని పక్షంలో చర్యలు తప్పవని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బీడీఎల్ కాలనీలో మంగళవారం ఇన్సెంటివ్ శానిటేషన్ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇంట్రడక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు శానిటేషన్ లోపాలను కార్పొరేటర్‌కు వివరించారు. కాలనీలో చెత్త చెదారం పేరుకుపోతోందని, ప్రధాన రోడ్లలో భారీ వాహనాల రాకపోకలతో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ధ్వంసమై ప్రమాదకరంగా మారుతున్నాయన్నారు. కాలనీలో సరిపడ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు వాహిని, నరేంద్రతేజ, లక్ష్మణ్, కాలనీ అధ్యక్షుడు మాధవరెడ్డి, కార్యదర్శి సుధీర్‌రెడ్డి, సభ్యులు శంకర్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జవహర్‌నగర్ ప్రధాన రహదారి పనులు పూర్తి చేయాలి : మేయర్ మేకల కావ్య

**జవహర్‌నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** జవహర్‌నగర్ ప్రధాన రహదారి పనులను 20 రోజుల్లో పూర్తి చేయాలని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ 20 రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారని తెలిపారు. గడువులోగా రోడ్డు పనులు పూర్తయితే జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు మరో 30 కోట్ల రూపాయలు మంజూరు చేస్తానని మంత్రి కేటీఆర్ ఇటీవల జరిగిన సభలో హామీ ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు రోడ్డు పనులను 20 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈఈ మురళి, ఏఈ రాజశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.